ప్రజాశక్తి
గురువారం 22 ఫిబ్రవరి 2024 5 అనంతపురం





తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న మహిళాసంఘ సభ్యురాలు

ఓసు... వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు !



♦ఉన్నం.. మాదినేని దోస్త్‌మేరా.. దోస్త్ ♦సురేంద్రబాబు నాన్ లోకలట..
♦స్థానికులకే టికెట్ ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి ♦కళ్యాణదుర్గం టిడిపిలో ఆసక్తికర పరిణామాలు

ఒకే పార్టీలో ఉంటున్నా..నిన్నా.. మొన్నటి వరకు ఆ ఇద్దరూ బద్ద శత్రువులుగా ఉంటూ వచ్చారు. 2019 నుంచి ఇప్పటి వరకూ ఒకరంటే ఒకరికి గిట్టక బజారులో నిలబడి తలపడిన సందర్భాలూ ఉన్నాయి. అధిష్టానం అనేక మార్లు ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో అధిష్టానం కొత్త అభ్యర్థిని దింపే ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. అందులో భాగంగా కొత్త అభ్యర్థి కళ్యాణదుర్గంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అంతే... వెంటనే ఆ ఇద్దరి మధ్య శత్రుత్వం మాయమైపోయింది. ఇద్దరూ కలసి బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి తామిద్దరిలో ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా ఒక్కటే.. మరొకరికి అవకాశమివ్వద్దని ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారమంతా అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని టిడిపికి సంబంధించినది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి కుమారుడు మారుతీ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమా మహేశ్వరనాయుడు మధ్య ఇటీవల కాలం వరకు పచ్చగట్టి వేస్తే భగ్గుమనేది. నిన్న..మొన్నటి వరకు వీరిద్దరి మధ్య నీవెంత అంటే నీ వెంత అన్న పరిస్థితి ఉండేది. 2109 ఎన్నికల సమయంలో హనుమంతరాయచౌదరి కుటుంబానికి కాదని ఉమా మహేశ్వరనాయుడుకి అధిష్టానం టిక్కెట్టు ఇచ్చింది. అప్పటి నుంచి ఆ ఇద్దరి మధ్య గ్రూపు తగాదాలు తారాస్థాయిలో చేరాయి. ఈ తగాదాల నడుమే 2019 ఎన్నికల్లో అక్కడ టిడిపి ఓటమి చెందింది. ఆ తరువాత కూడా ఇవి కొనసాగుతూ వచ్చాయి. ఇప్పుడు అధిష్టానం ఆ స్థానం నుంచి ప్రముఖ కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబును బరిలో దింపే ఆలోచన చేస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. గత వారం నుంచే ఆయన అక్కడ గృహ నిర్మాణపు పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఉన్నఫలంగా ఇద్దరు నేతలు మారుతీ చౌదరి, ఉమా మహేశ్వరనాయుడు ఏకమై మీడియా సమావేశం ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఇద్దరు స్థానికులం, పార్టీ కోసం జెండాలు మోసినవాళ్లం. తమకు కాదని స్థానికేతరులకు ఏ రకంగా టిక్కెట్టు ఇస్తారని అధిష్టానాన్ని వీరు ప్రశ్నిస్తుండటం గమనార్హం. తమలో ఎవరికిచ్చినా పార్టీ విజయాని కృషి చేస్తామని కలసి చెప్పడం ఆ పార్టీ శ్రేణులనే విస్మయానికి గురి చేసింది. ఎందుకంటే ఐదేళ్లుగా రెండు గ్రూపుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే విధంగా పరిస్థితి ఉండేది. దీంతో క్షేత్ర స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా రెండు గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఈ ఇద్దరు నేతలు కలసి ఈప్రకటన చేయడం నాయకులను, కార్యకర్తలను విస్మయానికి గురి చేసింది. వీరి కోసమా తమ పార్టీ వారితోనే వైరం పెట్టుకున్నాం అని వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు వీరిద్దరూ ఏకమవడంతో సర్దుబాటు ఎలాగన్న గందరగోళంలో పడ్డారు. తనకే టిక్కెట్టు అని భావిస్తూ రకాల ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో ఇప్పటి వరకు ఒకరంటే ఒకరికి గిట్టనట్టుగానున్న ఆ ఇద్దరు నేతలూ కలసి ఈ రకంగా మాట్లాడటంతో అమిలినేని సురేంద్రబాబు పరిస్థితి ఏమిటన్నది మరో ఆసక్తికరమైన అంశంగానూ మారింది. ఎందుకంటే సురేంద్రబాబు 2009 నుంచి రాజకీయ రంగ ప్రవేశానికి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ప్రజారాజ్యం ద్వారా 2009లో అనంతపురం అసెంబ్లీకి పోటీ చేయాలని భావించారు. ఆయనకే టిక్కెట్టు అని భావిస్తున్న తరుణంలో చివరి నిమిషంలో మార్పు జరిగి టిసి.ప్రకాశ్‌కు ఇచ్చారు. దీంతో ఆయన కన్నీటి పర్యాంతమూ అయ్యారు. ఆ తరువాత 2014 ఎన్నికల్లో టిడిపి అనంతపురం అసెంబ్లీకి టిక్కెట్టు ఖరారైంది. చివరి నిమిషంలో మార్పు జరిగింది. దీంతో రెండోసారి నిరాశే ఎదురైంది. 2019లోనూ ప్రయత్నం చేసినా ఎక్కడా అవకాశం లభించలేదు. ఇప్పుడు తాజాగా 2024లో కళ్యాణదుర్గానికి దాదాపు ఖరారంటూ ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో అక్కడి నాయకులు ఈ రకమైన ప్రకటన చేయడంతో ఈసారి సురేంద్రబాబు పరిస్థితి ఏమవుతుందోనన్న చర్చ రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇప్పుడు అధిష్టానం ఎటువంటి నిర్ణయం ప్రకటిస్తుందో చూడాల్సుంది.

పార్టీ జెండా మోసిన వారికే టికెట్ కేటాయించాలి

ప్రజాశక్తి కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం టిడిపి టికెట్ ప్రముఖ కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్రబాబు పేరు తెరపైకి రావడంతో స్థానిక టిడిపి వర్గీయులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు నానా తంటాలు పడుతున్నారు. ఇందులో బాగానే బుధవారం స్థానిక ఎన్టీఆర్ భవన్ హడావుడి చేశారు. ఈ సందర్భంగా ఉన్నం, మాదినేని ఉమ్మడిగా సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో ఇరువర్గాల మధ్య విభేదాలు ఉన్న విషయం వాస్తవమేనని అన్నారు. అయితే పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న నాయకులకు కాకుండా ఇతరులకు టికెట్ ఇస్తే సహకరించేది లేదని తేల్చి చెప్పారు. పారిశ్రామికవేత్త ఇక్కడికి వచ్చి హల్‌చల్ చేస్తే సహించేది లేదని అన్నారు. విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేస్తామని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన ఏ వ్యక్తికి టికెట్ కేటాయించిన గెలిపించుకునేందుకు ఇరు వర్గాల నాయకులు కార్యకర్తలు పనిచేస్తామని చెప్పారు. ఇకనుండి ఇలాంటి విభేదాలు ఉండవని ఉన్నం ఉమా మీడియా ముఖంగా చెప్పారు. అనంతరం ఉమా స్వగహానికి ఉన్నం వర్గీయులు, ఉన్నం స్వగహమైన ఎర్రంపల్లి గ్రామానికి ఉమా వర్గీయులు వెళ్లి సమాలోచన చేశారు. నేటి నుంచే పార్టీ బలోపేతానికి సమిష్టిగా కషి చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్టీసీ శంకర్, దొడగట్టి నారాయణ, రామరాజు, నరసాపురం మురళి, దురదకుంట సురేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉన్నం హనుమంతరాయ చౌదరి, మాదినేని ఉమామహేశ్వర నాయుడు

డ్వాక్రా రుణాల చెల్లింపులో గోల్‌మాల్..

చేతివాటం ప్రదర్శించిన యానిమేటర్
కన్నీరు పెట్టుకున్న మహిళా సంఘ సభ్యులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

డ్వాక్రా రుణాలు తీసుకొని ప్రతినెలా సక్రమంగా కంతులకు సంబందించిన డబ్బును యానిమేటర్‌కు నమ్మి ఇస్తే చేతివాటం ప్రదర్శించి లక్షల రూపాయల కాజేసిందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈఘటనకు సంబందించి బాధితులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పత్తి కుంటపల్లిలో శ్రీ సత్యసాయి, నానావళి సంఘాల సభ్యులు బ్యాంకులో రుణం తీసుకున్నారు. ప్రతినెల కట్టే కంతులకు సంబందించిన



మండల సమాఖ్య భవనం

డబ్బులను ఆసంఘాల సభ్యులు ఆనిమేటర్ పార్వతికి ఇచ్చేవారు. అయితే ఆమె బ్యాంకులో జమ చేయకుండా తన అవసరాలకు ఉపయోగించుకుంది. శ్రీ సత్యసాయి సంఘ సభ్యులు రెండు సంవత్సరాల క్రితం రెండు లక్షల రూపాయల రుణం తీసుకుని అన్ని కంతులు కట్టివేశారు. తర్వాత రుణం కావాలని పలుమార్లు యానిమేటరు అడిగారు. అయితే ఆమె ఈరోజు, రేపు అని చెప్పి ఆరు నెలలుగా కాలయాపన చేసింది. దీంతో ఆ సంఘ సభ్యులు స్థానిక పాలసముద్రంలోని కెనరా బ్యాంకు వారిని కలిసి తాము రుణం మొత్తం కట్టేశామని తమకు కొత్త రుణం మంజూరు చేయాలని కోరారు. దీంతో బ్యాంకు అధికారులు ఆసంఘం బ్యాంకు ఖాతాను పరిశీలించారు. ఇంకా 75 వేల రూపాయలు అప్పు మిగిలి ఉందని అది కట్టివేస్తే రుణం ఇస్తామని చెప్పారు. దీంతో సంఘం సభ్యులు అవాక్కయ్యారు. సభ్యులందరూ వెళ్లి ఆనిమేటర్ పార్వతిని నిలదీశారు. తమకు జరిగిన అన్యాయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా యానిమేటర్ కు సర్ది చెప్పి ఆమె వాడిన మొత్తం అమౌంట్ ను బుధవారం లోపు కట్టే విధంగా సెటిల్మెంట్ చేశారు. ఈ విషయం పలు సంఘాల సభ్యులకు తెలిసింది. తమకు ఇచ్చిన రుణం ఏమైందోనని నానావళి సంఘ సభ్యులు బుధవారం పాలసముద్రం కెనరా బ్యాంక్ మేనేజర్‌ను కలిశారు. ఆసంఘం బ్యాంకు ఖాతాను చెక్ చేయించారు. నానావళి మహిళా సంఘ సభ్యులు 10 మంది ఉండగా వారు రూ. 6.60 లక్షలలు రుణం తీసుకున్నారు. ఒక్కొక్క సభ్యురాలు నెలకు మూడు వేల రూపాయలతో 30 వేల రూపాయలు వసూలు చేసి సభ్యులలో ఒకరిద్దరూ ఆనిమేటర్‌తో కలిసి బ్యాంకుకు వెళ్లి కంతు కట్టేవారు. అయితే సంఘ సభ్యులు నిరక్షరాస్యులు, అమాయకులు కావడంతో ఆనిమేటర్ వారితో డబ్బు తీసుకొని తానే బ్యాంకు స్లిప్ రాసి ఇచ్చిన అప్పులో కొంత మాత్రమే కట్టి మిగతా మొత్తాన్ని తన అవసరాలను వాడుకున్నట్లు బయట పడింది. ఫిబ్రవరి 12న సంఘ సభ్యులు అందరూ రూ.29,500 వసూలు చేసి బ్యాంకులో రుణం కంతుకట్టడానికి యానిమేటర్ తో వెళ్లగా ఆనిమేటర్ బ్యాంకులో కేవలం రూ. 2, 950లు మాత్రమే బ్యాంకులో కట్టి బ్యాంక్ వారిచ్చిన స్లిప్పులో మరో సున్నా చేర్చి ఆస్లిప్పును సంఘ సభ్యులకు ఇచ్చినట్లు గుర్తించారు. ఒక్కొక్క కంతుకు రూ. 30,000 వేల ప్రకారం మొత్తం 15 కంతులకు గాను కేవలం రూ. 1. 65 లక్షలు మాత్రమే బ్యాంకులో జమ చేయగా ఇంకా రూ. 5. 50 లక్షలు బాకీ ఉన్నట్లు బ్యాంకు అధికారులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతో నానావళి సంఘ మహిళా సభ్యులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కూలీనాలి చేసి అప్పు కట్టామని ఆనిమేటర్ చేతివాటం ప్రదర్శించడంతో బ్యాంకులో అప్పు అట్లే ఉండిపోయిందని కన్నీరు పెట్టుకున్నారు. వెలుగు అధికారులు తమకు న్యాయం చేయకపోతే ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులకు విన్నవిస్తామని , పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

ఎపిఎం రామాంజనేయులు వివరణ : పత్తికుంటపల్లి డ్వాక్రా సంఘాల లో జరిగిన అవకతవకలపై ఎపిఎం రామాంజనేయులును వివరణ శ్రీ సత్యసాయి సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి ఆనిమేటర్ పార్వతి తోనే ఆమె వాడుకున్న డబ్బును కట్టించామన్నారు. ఆ సంఘానికి 10 లక్షల రూపాయల లోన్ కూడా మంజూరు చేయడానికి బ్యాంక్ వారికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇక నానావతి సంఘంలో జరిగిన అవకతవకలపై ఆ సంఘ బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకున్నామని దీనిపైన తమ సీసీతో విచారణ చేయిస్తామని చెప్పారు. అవకతవకలు నిజమని తెలిస్తే సంఘ సభ్యులు నష్టపోయిన అమౌంటును ఆనిమేటర్ తోనే కట్టిస్తామని చెప్పారు. ఆనిమేటర్ చేసిన అవకతవకలను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి వారి సూచన మేరకు ఆనిమేటర్ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి : డిఇఒ

ప్రజాశక్తి-గార్లదిన్నె

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారిణి బి.వరలక్ష్మి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, ప్రైమరీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇక్కడ రికార్డుల కంటే ఎక్కువగా బియ్యం నిల్వ ఉండటాన్ని గుర్తించి హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనాన్ని కట్టెల పొయ్యితో చేస్తుండటంతో గ్యాస్ మీద చేయాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. తర్వాత ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కిచెన్ షెడ్, వంట తయారు చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే ఉన్న ఎపి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేయగా సౌకర్యాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం టీచర్లతో సమావేశమై పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు పాల్గొన్నారు.



విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలిస్తున్న డిఇఒ

అభివృద్ధికి అండగా నిలవాలి : ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి అధికారంలోకి వచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి అండగా నిలవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని 40వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ప్రజలకు అండగా నిలిచామన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా అనంతపురాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రధాన రహదారులే కాకుండా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టామన్నారు. గత టిడిపి ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైతే తాము చేతల్లో చూపుతున్నామన్నారు. కావున ప్రజలు అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

'అనంత' నుంచి కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్

ప్రజాశక్తి-హిందూపురం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని అనంతపురం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎపిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శైలజనాథ్, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జంగా గౌతమ్, ఏఐసీసీ మెంబర్ కెటి శ్రీధర్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి సత్తార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బాలాజీ మనోహర్, హరిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శైలజనాథ్ మాట్లాడుతు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు షర్మిల అధ్యక్షతన ఈనెల 26న అనంతపురంలో ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్, కాంగ్రెస్ పెద్దలు రఘువీరారెడ్డి, మాజీ మంత్రులు, తదితర మఖ్యనాయకులు పాల్గొంటారని చెప్పారు. జగన్ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టిందన్నారు. ఆ భయం నుంచి బయటపడడానికి అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం అధికారులను అడ్డం పెట్టుకుని, వందల కోట్లు ఖర్చు పెడుతూ సిద్ధం సభలను ఏర్పాటు చేసి జన బలాన్ని చూపిస్తోందని విమర్శించారు. అనంతపురం జిల్లా రాప్తాడు లో ఏర్పాటు చేసిన సిద్ధం సభలో జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పలేదన్నారు. కాంగ్రెస్ బలపడితే వైసిపి ఖాళీ అవుతుందన్న భయంతో నాయకులను ప్రజలను ఆకర్షించుకోవడానికి సిద్ధం సభలను ముఖ్యమంత్రి ఏర్పాటు చేస్తూ బల ప్రదర్శన చేపడుతున్నారని విమర్శించారు. సభలో ముఖ్యమంత్రి సోది వినలేక జనాలు వెనక్కి వెళు తున్న తరుణంలో ఆ దృశ్యాలను చిత్రీకరించిన మీడియా ఫోటోగ్రాఫర్ పై దాడికి పాల్పడడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఈనెల 26న అనంతపురంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌఫ్‌సాబ్, అతావుల్లా, అమానుల్లా, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయం కాంగ్రెస్ దే

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్రంలో ప్రత్యామ్నాయం, భవిష్యత్తు అంతా కాంగ్రెస్‌దే అని పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణం లోని మేడ అతిధిగృహంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ల గంగాద్రి అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఈనెల 26న అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ జరగనున్నదన్నారు. ఆ సభలో జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలతో పాటు జాతీయ నాయకులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో, దేశంలో ప్రత్యామ్నాయ పార్టీగా కాంగ్రెస్ పార్టీ ఎదుగుతుందన్నారు. వైసిపి పాలన వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ఆ సభకు ప్రతి నియోజకవర్గంలో నుంచి భారీగా జన సమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. వర్కింగ్ అధ్యక్షులు గౌతం మాట్లాడుతూ ఇటు తెలంగాణ అటు కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. తిరిగి రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పట్ల ప్రజలలో నమ్మకం ఏర్పడుతోందన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కోట సత్యం, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలాజీ మనోహర్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఖాసీంఖాన్, కెటి. శ్రీధర్, ఆ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఖాజీ షకీరా, పటాన్ గౌస్‌తో పాటు ఆరు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.



హిందూపురంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఢిల్లీ ఉద్యమ రైతు మృతి బాధాకరం

అనంతపురం కలెక్టరేట్ : హర్యానా రాష్ట్రం కానూరి సరిహద్దులో హర్యానా పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో యువరైతు శుభ్‌కరణ్ సింగ్ (24) మృతి బాధాకరమని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధరల చట్టం తీసుకురావాలని కోరుతూ రైతాంగం ఢిల్లీకి శాంతియుతంగా నిర్వహిస్తున్న ప్రదర్శనపై పోలీసులు వైఖరి తగదన్నారు. రైతు ఉద్యమం పట్ల బిజెపి, నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. రైతు మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి
ఎస్పీ కెకెఎన్. అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



ఎన్నికల విధి విధానాలపై కానిస్టేబుల్ నుంచి సిఐల వరకూ ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సూచించారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు పాటించాల్సిన విధి విధానాలు, చేపట్టాల్సిన విధులపై బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు గల పోలీసుల పాత్ర-విధులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. తర్వాత రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలపై క్షుణ్ణంగా అవగాహన చేశారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీఆర్ విజయభాస్కర్‌రెడ్డి, పలువురు సి.ఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు దరఖాస్తుల పరిశీలన : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రత్యేక ఓటరు సవరణ జాబితా కార్యక్రమం-2024 కింద చేపడుతున్న కంటినేషన్ అప్డేషన్‌లో భాగంగా ఫామ్-6, 7, 8 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోందని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బుధవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటర్ల జాబితా విడుదల అనంతరం కంటినేషన్ అప్డేషన్‌లో భాగంగా ఫామ్- 6, 7, 8 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఫామ్- 6, 8కి సంబంధించి ఎలాంటి సమస్య లేదని, ఫామ్-7కి సంబంధించి డెత్ కేసులు, డూప్లికేట్ కేసులను పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఎపిక్ కార్డుల జనరేషన్‌కి సంబంధించి వచ్చే మంగళవారం నాటికి జిల్లాకు 2.30 లక్షల కార్డులు రానున్నాయని, వాటిని పోస్టాఫీస్ ద్వారా ఓటర్లకు అందజేస్తామన్నారు. హోమ్ ఓటింగ్‌కు సంబంధించి 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లు, పిడబ్ల్యుడి ఓటర్లు ఎంతమంది ఉన్నారు.. అనేది క్షేత్రస్థాయిలో బీఎల్వోలతో గుర్తిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 1,500 ఓటర్ల సంఖ్య దాటిన చోట ఈవారంలోపు నూతన పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ స్టేషన్స్ జాబితాను తయారు చేస్తున్నామని, గత ఎన్నికల్లో 90 కన్నా ఎక్కువ ఓటు నమోదు, 10 శాతం కన్నా తక్కువ ఓటింగ్ నమోదు, 75 శాతం ఒక అభ్యర్థికి ఓటు వచ్చినా, తదితర ఏడు రకాల పారామీటర్స్ తో పోలింగ్ స్టేషన్స్‌ను గుర్తించనున్నట్లు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతివారం జరిగే సమావేశాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, టిడిపి ప్రతినిధి చెరకుతోట పవన్‌కుమార్, వైసిపి ప్రతినిధులు కేవీ రమణ, శ్రీనివాసులు, బిజెపి ప్రతినిధి ఈశ్వర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎంఎండి.ఇమామ్, సిపిఎం బాలరంగయ్య, ఆమ్‌ఆద్మీ పార్టీ మసూద్ వలి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎలక్షన్ సెల్ సీనియర్ అసిస్టెంట్ శ్యాముల్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమీక్ష


సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చిట్టిబాబు మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 10వ తేదీ నుంచి ఈఏడాది ఫిబ్రవరి 21వ తేదీ వరకు రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల చేర్పులు, తొలగింపులు, మార్పులు సవరణలకు సంబంధించి ఫార్మ్ 6, 7, 8కు 8481 దరఖాస్తులు రాగా 1515 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 996 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. 5755 దరఖాస్తుల పరిశీలన అనంతరం ఓటరు జాబితాలో చేర్చామన్నారు. కాగా ఇంటి వద్దనే ఓటు వేయాలనుకునే వికలాంగులు వారి అంగవైకల్యం 45 శాతానికి మించి ఉన్నట్లు ధ్రువీకరణ సర్టిఫికేట్‌ను దరఖాస్తుతోపాటు ఇవ్వాలన్నారు. అదేవిధంగా 80 ఏళ్ళ పైబడిన వృద్ధులు వారి వయోధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ వార్డు వాలంటీర్లను ఎన్నికల విధులకు కేటాయించరాదన్నారు. గతంలో ఓటర్ జాబితాలో భార్యాభర్తలు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండగా ప్రస్తుతం ఎన్నికల విభాగం రూపొందించిన ఓటరు జాబితాలో భర్త ఒక పోలింగ్ కేంద్రంలో, భార్య ఇంకో పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును కలిగి ఉన్నారన్నారు. ఈ సమావేశంలో బొమ్మనహాల్, కణేకల్లు, గుమ్మఘట్ట తహశీల్దార్లు రామాంజనమ్మ, ఇంద్రిరాణి, వెంకటేశ్వర్లు, బాలకృష్ణారెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాతాదేవి, రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ షేక్‌మాలిక్, సిపిఎం నాయకులు బంగి శివ, టిడిపి నాయకులు పురుషోత్తం, మహబూబ్‌బాషా, సిపిఐ నాయకులు నాగార్జున, దుర్గన్న, బీఎస్పీ నాయకులు ఉలిగప్ప, వైసిపి నాయకులు పొరాళ శివ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలోని అంబేద్కర్ నగర్ 9వ వార్డులో సీసీ రోడ్లలో పడిన గుంతలు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం జనసేన, తెలుగుదేశం ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మేలు చేశామని గొప్పలు చెబుతున్న అధికార పార్టీ నాయకులు ఒకసారి ఇటువైపు చూడాలన్నారు. వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. రోడ్లకు ఇరువైపులా ఆక్రమించిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉరవకొండ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, 9వ వార్డు సభ్యులు రామాంజినేయులు, టిడిపి నాయకులు గోపాల్, రవివర్మ, జనసేన నాయకులు రాజేష్, రమేష్, మణికుమార్, మల్లేష్‌గౌడ్, ధనుంజయ, భీమా, భోగేష్, కుమార్, అభిరామ్, అనిల్‌కుమార్, చరణ్, వంశీ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి : ఎంపిపి


పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపిపి నరసింహులు

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉరవకొండ ఎంపిపి నరసింహులు సూచించారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ఉరవకొండ డివిజన్ మలేరియా నివారణ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి మాట్లాడుతూ డ్రెయినేజీ నుంచి పేరుకుపోయిన ప్రాంతంలో ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణకు తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, మండల ప్రజా పరిషత్ ఇంజనీర్ మధుసూదన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ జయ, పాఠశాల సిబ్బంది, 5వ సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సిఎం చేసుకుందాం : శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రతి ఒక్కరం కష్టపడి పని చేసి టిడిపి అధినేత చంద్రబాబును సిఎంను చేసుకుందామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం యల్లనూరు మండలం తిరుమలాపురం గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రస్తుత సైకో పాలన పోవాలంటే వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం పుట్లూరు మండలం చింతకుంట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు జయరామ్‌రెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, కడవకల్లు గోవర్ధన్‌రాజు, ఓబులాపురం హరి, జెఆర్.పేట బాబు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం


మృతదేహం వద్ద దండు శ్రీనివాసులు

ప్రజాశక్తి-శింగనమల

అనంతపురంలోని మార్కెట్ యార్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచందిన మండల పరిధిలోని గుమ్మేపల్లి పంచాయతీ ఏకులనాగేపల్లి గ్రామానికి చెందిన బి.మనోజ్ మృతికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు బుధవారం నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10వేలు అందజేసి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, టిఎన్‌టిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరుశురాం, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటిరెడ్డి, నాయకులు బెస్త నారాయణస్వామి, దండు సతీష్‌రాయల్, మల్లికార్జున, ప్రసాద్‌నాయక్, జంఘంశెట్టి నవీన్, వడ్డే పవన్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే పేదల అభివృద్ధి : ఎమ్మెల్యే కేశవ్


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-బెలుగుప్ప

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం ద్వారానే పేదల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాలుపల్లి గ్రామంలో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దఎత్తున ఎమ్మెల్యేకు హారతులు పట్టి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నిరంతరం పేదల కోసమే శ్రమిస్తారన్నారు. 50 రోజుల్లో జరిగే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేస్తాం

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి


కరపత్రాలు అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టిడిపి అధికారంలోకి వస్తే అనంతపురం కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. బుధవారం నగరంలోని 37వ డివిజన్‌లో టిడిపి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వచ్చేది తమ ప్రభుత్వమే అని సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా టిడిపి హయాంలో నగరంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీతో పాటు, డంపింగ్ యార్డ్‌ను దూరంగా తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ రాజీవ్‌రెడ్డి, సాలార్‌బాషా, తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, డాక్టర్ లక్ష్మీప్రసాద్, జేఎం.బాషా, పరమేశ్, వన్నూరప్ప, నారాయణస్వామి యాదవ్, రాజారావు, సుధాకర్‌యాదవ్, మారుతీకుమార్ గౌడ్, సైపుద్దీన్, పూల బాషా, పరందామయ్య, షణ్ముఖ, పోతుల లక్ష్మీనరసింహులు, మార్కెట్ మహేష్, ముక్తియార్, గోపాల్ గౌడ్ బోయపాటి బాలప్ప, మల్లికార్జున, నౌజియా రఫీ, కడియాల కొండన్న, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీరెడ్డి, బుల్లే శివబాల, సంఘా తేజస్విని, కృష్ణవేణి, సరళ, జానకి, మహేశ్వరి, సుజాత, వసుంధర, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, హసీనా, షరీనా, మేడా మణమ్మ, కందుకూరి రాధ, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు

ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి


ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపిన సిఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు గ్రామంలోని వైఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో వైఎస్‌ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎవరూ అమలు చేయని పథకాలను రాష్ట్రంలో సిఎం జగన్ అమలు చేస్తున్నారనానరు. అంతేగాకుండా వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం ఎదురు చూడకుండా, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా నేరుగా ఇంటి దగ్గరకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. ఒక్క గార్లదిన్నె మండలంలోనే వైఎస్‌ఆర్ ఆసరా ద్వారా 929 స్వయం సహాయక సంఘాలకు రూ.7.65 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకూ మహిళా సంఘాలకు నాలుగు విడతల్లో రూ.30.61 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. కావున వచ్చే ఎన్నికలు పేదలు, పెత్తందారులకు జరుగుతున్నాయని, పేదలే గెలవాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త శంకర్‌నారాయణ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి శింగనమల సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు, ఎంపిపి వెంకటనారాయణ, మాజీ ఎంపిపి ప్రదీప్‌రెడ్డి, మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపిడిఒ వెంకటలక్ష్మి, వెలుగు ఎపిఎం శ్రీరాములు, క్లస్టర్ సీసీ రామాంజనేయులు, కార్యకర్తలు, మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆదరించండి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


ప్రజలకు నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంతోపాటు ఉరవకొండ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. బుధవారం కూడేరు మండలం కమ్మూరు గ్రామంలో ఇంటింటికీ మన విశ్వన్న కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామాలోని పెద్దమ్మ, మారెమ్మ అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చే నాయకులు, వారు ఇచ్చే హామీలను నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించాలని కోరారు. అనంతరం రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వైఎస్‌ఆర్ హెల్త్‌క్లినిక్‌లను ప్రారంభించారు. తర్వాత వాలంటీర్ల అభినందన సభలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రంగారెడ్డి, ఎంపిపి నారాయణరెడ్డి, జడ్పిటిసి అశ్విని, వైస్ ఎంపిపిలు దేవా, సుబ్బమ్మ, వైసిపి మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, జెసిఎస్ కన్వీనర్ దేవేంద్ర, అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ నిర్మలమ్మ, కమ్మూరు నాయకులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ

అనంతపురం కలెక్టరేట్ : కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో కలెక్టర్ ఎం.గౌతమిని డీఎస్పీ వీరరాఘవరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతపురం టౌన్ డీఎస్పీగా బాధ్యలలు చేపట్టిన సందర్భంగా కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

నేడు వాలంటీర్లకు వందనం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో గురువారం వైఎస్‌ఆర్ ఆసరా 4వ విడత, వాలంటీర్లకు వందనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ, వెలుగు సిబ్బంది, వాలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

268 క్వింటాళ్ల చింతపండు రాక

రాయదుర్గం రూరల్ : స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం 268.8 క్వింటాళ్ల చింతపండు క్రయ, విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఫ్లవర్ రకం రూ.4వేల నుంచి రూ.7,500, కరిపుళి రకం రూ.9వేల నుంచి 18 వేల దాకా ధర లభించిందన్నారు.

ఆసుపత్రికి దారి ఏర్పాటు

పామిడి : స్థానిక ప్రభుత్వ వైద్యశాలను నూతనంగా రూ.5.12 కోట్లతో దారిని ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఆసుపత్రికి దారి సౌకర్యం సరిగా లేకపోవడంతో ఆసుపత్రి కోసం వచ్చే ప్రజలు, అంబులెన్సులు, 108, 104, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉండేవి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం దారిని పరిశీలించారు. ఇందులో భాగంగా వీధి వ్యాపారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐ.రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, పోలీస్, వైద్య, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని బేతాపల్లి పాఠశాలలో హెచ్‌ఎం మహాలక్ష్మి అధ్యక్షతన బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస, ఉపన్యాస, పద్య పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా ఉపాధ్యాయుని సులోచన పాఠశాలకు వాటర్ ట్యాంకును విరాళంగా ఇచ్చారు. విద్యార్థులకు బహుమతులు-మిఠాయిలు ఉపాధ్యాయిని సాధన పంపిణీ చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ జోసెఫ్ కీర్తి ప్రకాష్ విద్యుత్ మోటారును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, సుజాత, నరేంద్ర, రవీంద్రనాథ్‌రెడ్డి, నిరుపమ, రామకృష్ణయ్య, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

అలాగే పెన్షనర్స్ భవన్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబుబకార్, కార్యదర్శి కె. రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుళ్లాయిబాబు, నాయకులు శామ్యూల్, నారాయణరెడ్డి, గోవిందప్ప, నారాయణ శెట్టి, చెన్నారెడ్డి, నారాయణస్వామి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి జకినీమాత ఉత్సవాలు



ప్రజాశక్తి-గుత్తి

ఆరే కటికల ఆరాధ్య దైవం జకినీమాత ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఆరేకటికలు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం అమ్మవారికి హోమం, పూర్ణాహుతి సాయంత్రం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. తర్వాత అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి అమ్మవారికి పూర్ణ కలశాలతో ఊరేగిస్తారన్నారు. శుక్రవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అయ్యప్ప స్వామి ఆలయంలో అమ్మవారికి గంగాభిషేకం చేయనున్నట్లు తెలిపారు.

న్యాయం చేయండి..


విలేకరులతో మాట్లాడుతున్న బాధితుడు లక్ష్మన్న

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తన స్థలం కబ్జాకు గురి కాకుండా న్యాయం చేయాలని వికలాంగుడు, ఆటో డ్రైవర్ లక్ష్మన్న కోరాడు. బుధవారం నగరంలో విలేకరుతో మాట్లాడుతూ వికలాంగుడినైన తాను ఆటో నడుపుకుంటూ నగరంలో జీవనం సాగిస్తున్నానన్నారు. అయితే తనకు సర్వే నెంబర్ 15, ప్లాట్ నెంబర్ 145లో 5 సెంట్ల రిజిస్ట్రేషన్ నివాస స్థలం ఉందన్నారు. ఆ స్థలాన్ని కురుబ నాగమణి సర్వే నెంబర్ 14/2తో తనకు తహశీల్దార్ డీఫారం పట్టా ఇచ్చారని చెబుతూ ఆక్రమించుకోవాలని చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై ఆర్టీఐ యాక్ట్ ద్వారా సమాచారం అడుగగా డీఫారం పట్టా చెల్లదని తెలిపారన్నారు. ఈవిషయమై ఎస్పీకి ఫిర్యాదు చేయగా ఆయన స్పందించి రూరల్ డీఎస్పీ శివారెడ్డి ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దయచేసి ఇలాంటి వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అనంతపురం రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు ఎదురుగా 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తి నుంచి పెద్దవడుగూరు వైపు వెళ్తున్న ఆటో పెట్రోల్ బంకులో డీజిల్ వేయించుకుని బయటకు వస్తుండగా రహదారిపై మడకశిర డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తాడిపత్రి మండలం గన్నేవారి పల్లెకు చెందిన చింతా జయమ్మ, సిరివెల్లి లక్ష్మీదేవి, ఉమాదేవి, నాగ మునెమ్మ, లక్ష్మీనారాయణ, నాగ చరణ్, హారిక, పెద్దవడుగూరు మండలానికి చెందిన చింతా లక్ష్మీదేవి, జయమ్మ, నాగరత్నమ్మ, రాముడు, ఆటో డ్రైవర్ రాజుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఆషాబేగం పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

బొమ్మనహాల్ : మండలంలోని ఉద్దేహాల్ వేదావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ అధికారులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు సెబ్ అధికారులు తెలిపారు.

మద్యం పట్టివేత

గార్లదిన్నె : మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ గౌస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అనిల్‌కుమార్‌రెడ్డి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకోవడంతోపాటు 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్త కొడుతున్నాడని ఫిర్యాదు

పుట్లూరు : భర్త కొడుతున్నాడని భార్య ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. తక్కల్లపల్లి గ్రామానికి చెందిన బాల ఓబులేసు రోజూ తాగి వచ్చి కొడుతున్నాడని భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు చేసిందన్నారు. ఇందులో భాగంగానే మంగళవారం తాగి వచ్చి కట్టెతో దాడి చేయగా తీవ్ర గాయాలైనట్లు బుధవారం ఫిర్యాదు చేసిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభ్యసన మెరుగుదలపై పరిశీలన


విద్యాబోధన తీరును తెలుసుకుంటున్న అధికారులు

రాయదుర్గం : పట్టణంలోని మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను అభ్యసన మెరుగుదల రాష్ట్ర బృందం బుధవారం పరిశీలించింది. ఇందులో భాగంగా బెలుగుప్ప ఎంఇఒ మల్లారెడ్డి నేతృత్వంలో విజయ్‌కుమార్, మరో ఇద్దరు సభ్యుల బందం పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ బాలికొన్నత పాఠశాల, అభ్యుదయ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో అభ్యసన మెరుగుదలను పరిశీలించారు. ఈ కార్యక్రమం కింద ఇది వరకూ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో అభ్యసన మెరుగుదలకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అమలు చేస్తున్నారా..లేదా.. అని పరిశీలించారు.

పత్రికా కార్యాలయంపై దాడి దుర్మార్గం

రాయదుర్గం : కర్నూలులో ఈనాడు దినపత్రిక కార్యాలయంపై ఎమ్మెల్యే కాటసాని అనుచరులు దాడి చేయడాన్ని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొట్రేష్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాసే వార్తలు వాస్తవం కానప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవాలేగానీ, దాడులకు పాల్పడటం సమంజసం కాదన్నారు. అంతేగాకుండా మీడియాపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. వీటిని ప్రభుత్వ వెంటనే అరికట్టాలన్నారు. లేనిపక్షంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఉరవకొండ : కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి అప్రజాస్వామికమని, హింసను ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. పత్రికా విలేకరులు, కార్యాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు కళ్లకు నల్లబ్యాడ్జీలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు రామాంజనేయులు, నర్రా కేశన్న, ప్యారం కేశవానంద, వార్డు సభ్యులు రామాంజనేయులు, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని చదం గ్రామంలో బుధవారం సాయంత్రం ఆంజనేయ స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ఆశీనులను చేసి రథాన్ని లాగారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

ఆధార్ మెగామేళా పరిశీలన

నార్పల : మండల కేంద్రంలోని 4వ గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ మెగా మేళాను ఎంపిడిఒ రాముడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చిన ప్రజలకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త ఆధార్ నమోదుతోపాటు బర్త్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, 5 నుంచి 7, 15 నుంచి 17ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు 18 సంవత్సరాల పైబడి వ్యక్తులకు బయోమెట్రిక్ అప్‌డేట్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నంబరు, ఈ-మెయిల్, లింగం వంటి వాటిలో మార్పులు చేర్పులు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ ఉపేంద్ర, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి : ఎంపిడిఒ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

బెలుగుప్ప : 'నవ రత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా పేదలకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. బుధవాంర జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్లలో రూఫ్‌లెవెల్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేందుకు సచివాలయాల ఇంజనీర్లకు ఫీల్డ్ అసిస్టెంట్లు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శివారెడ్డి, ఎపిఒ భాగ్యలక్ష్మి, అధికారులు, గ్రామ సచివాలయ ఇంజనీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి దుర్మార్గం

నార్పల : వైసిపి మూకలు మీడియాపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అనిటిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. ప్రశ్నించే గళం వింటే జగన్‌రెడ్డికి వణుకు పుడుతోందన్నారు. అందుకే సిఎం జగన్‌కు ప్రజలు, ప్రతిపక్షపార్టీలు, మీడియా అంటే భయం పట్టుకుందన్నారు. ఆ భయాన్ని కప్పిపుచ్చుకునేందుకు మీడియాపై దాడులు చేయిస్తున్నాడన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ బుద్ధి తెచ్చుకుని మీడియాపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.